# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ ఆదివారం | 13 ఏప్రిల్ 2025 | ■ 10 పేజీలు






## భక్తిశ్రద్ధలతో..

# హనుమాన్ శోభాయాత్ర

వవనసుత.. భక్త హృది విజేత

- ■ జిల్లా వ్యాప్తంగా మారుమోగిన ఆంజనేయ నామస్మరణ...
- ■ ఉమ్మడి జిల్లాలో భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి
- ■ విగ్రహ పునః ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు
- ■ పల్లకి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్
- ■ తరలివచ్చిన భక్తజనం ■ పోలీసుల భారీ బందోబస్తు
- ■ అత్యాధునిక కెమెరాలు, డ్రోన్‌లతో పర్యవేక్షణ



హనుమత్ భక్తుల కోలాహలం.. మంగళవాయిద్యాలు.. డీజే మోతలు, కాషాయ జెండాలతో హనుమాన్ శోభాయాత్ర వైభవంగా సాగింది.. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో హనుమాన్ విగ్రహ శోభాయాత్ర ఘనంగా చేపట్టారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠం మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామితో కలిసి యాత్రను ప్రారంభించారు. ఈ శోభాయాత్రకు హాజరైన అశేష భక్తజనంతో పట్టణంలోని పురవీధులు కిటకిటలాడాయి. జై హనుమాన్.. జై శ్రీరామ్ అంటూ నినాదాలతో మారుమోగింది. ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. 300 మంది పోలీస్ బందోబస్తుతో సీసీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.



3లో



6

## ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

- ■ 15 మంది ప్రయాణికులకు గాయాలు ■ తీవ్రంగా గాయపడిన బస్సు డ్రైవర్, కండక్టర్
- ■ క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్ ■ జేసీబీతో బయటకు తీసి ఆస్పత్రికి తరలింపు
- ■ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి ■ లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం..

నిర్మల్ జిల్లా తురాటి గ్రామ ఎక్స్ రోడ్డు వద్ద 61వ జాతీయ రహదారి వద్ద శనివారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులకు గాయాలు, బస్సు డ్రైవర్ లతీఫ్, కండక్టర్ జంగం సుధారాణికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు లోకేశ్వరం మండలం రాజూరా నుంచి నిర్మల్ వెళ్తుంది. నిర్మల్ నుంచి కెమికల్ లోడ్‌తో భైంసా వైపు వెళ్తున్న లారీ ఓవర్టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. ప్రమాద సమయంలో బస్సులో 37 మంది ప్రయాణికులు ఉండగా 15 మందికి గాయాలయ్యాయి.

## ఆసిఫాబాద్ జిల్లాలో మావోయిస్టుల పోస్టర్ల కలకలం

- ■ మావోయిస్టులకు వ్యతిరేకంగా కరవెల్లి, బెజ్జూరులో పోస్టర్లు-2





## ఇద్దరి ప్రాణం తీసిన చేపల వేట

- ■ నీట మునిగి నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు మృతి -6లో



Gang of thieves



## దొంగల ముఠా అరెస్టు

- ■ బ్యాంక్‌లో గ్యాస్ కట్టర్లతో చోరీకి యత్నం
- ■ తొమ్మిది మందిపై కేసు నమోదు
- ■ ముగ్గురి అరెస్టు, పరారీలో మరో ముగ్గురు
- ■ ఇతర కేసుల్లో ఇప్పటికే జైలులో ముగ్గురు
- ■ మిగతా ముగ్గురిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు చర్యలు..
- ■ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

6

బ్యాంకు కన్నం వేసి గ్యాస్ కట్టర్లతో చోరీకి యత్నించిన దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి గ్రామంలో గ్రామీణ బ్యాంక్‌లో డిసెంబర్ 12న లోనికి చొరబడ్డారు. బ్యాంక్‌లో అమర్చిన మిషన్ డిటెక్షన్ అలారమ్ మోగడంతో పారిపోయారు. కేసుకు సంబంధించి 9 మంది చోరీకి పాల్పడగా ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు.



## అఘోరీ నా మొగుడు

- ■ అఘోరీని పెళ్లాడిన వర్షిణి ■ ఒకసారి కాదు రెండు సార్లు ■ తమను ఎవరూ వీడదీయలేరని సవాల్
- ■ ఫ్యామిలీని వదిలేసి మళ్లీ అఘోరీ చెంతకు ■ నాకు సంసారం వద్దు ■ నాకు ఏం వద్దు అఘోరీనే కావాలని పట్టు
- ■ అఘోరీది మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లి గ్రామం ■ వర్షిణి వ్యాఖ్యలతో బిత్తరపోతున్న నెటిజన్లు -8

# మావోలకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు

## ఆదివాసుల మీద మావోయిస్టుల అప్రకటిత యుద్ధం అంటూ పోస్టర్లు కలకలం




**ఆసిఫాబాద్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు దర్శనమివ్వడం చర్చకు దారితీసింది. కర్రెగుట్ట పేలుడు ఘటనను ప్రస్తావిస్తూ.. వాల్ పోస్టర్లను ముద్రించారు. ఆదివాసీల మీద అప్రకటిత యుద్ధం... మావోయిస్టులారా తీరవా... మీ రక్త దాహాలు, ఇదేనా మీ సిద్ధాంతం...? ఇందుకోసమేనా మీ పోరాటం..? అంటూ ఆదివాసీ యువజన సంఘం, తెలంగాణ రాష్ట్రం పేరిట వాల్‌పోస్టర్లను అంటించడంతో కలకలం రేపింది. చింతలమానేపల్లి మండలం కర్జవేల్లి, బెజ్జూరు మండల కేంద్రంలో వాల్ పోస్టర్లను అంటించడంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాల్ పోస్టర్లు అంటించడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. ఆదివాసీ యువజన సంఘం పేరున వాల్‌పోస్టర్లు అంటించడంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆదివాసి సంఘం పేరిట మావోయిస్టులకు హెచ్చరికలు జారీ చేయడంతో పోలీస్ శాఖ అప్రమత్తమై ఆ ప్రాంతంలో ప్రత్యేక నిఘా పెంచారు. మావోయిస్టులకు హెచ్చరికలు జారీ చేస్తూ ఆదివాసి సంఘం నాయకులు వాల్‌పోస్టర్లను అంటించారా లేదా ఇంకా ఎవరైనా ఇలాంటి పని చేశారా అనే దానిపై పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలనలో నిమగ్నమయ్యారు. కర్రెగుట్టలో మందు పాత్ర పేలుడు జరిగి చాలా రోజులు అయినప్పటికీ ఇప్పుడు వాల్ పోస్టర్లు పెట్టి మావోయిస్టులకు సవాల్ విసిరడంపై చర్చనీయాంశం అయింది. అయితే ఈ పోస్టర్‌లు ఆదివాసి యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకులు విడుదల చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఈ పోస్టర్‌లపై ఎస్ఐ నరేష్‌ను వివరణ కోరగా మండలంలో రవీంద్రనగర్, కరవెల్లి గ్రామాల్లో ఆదివాసీ యువజన సంఘం, తెలంగాణ రాష్ట్ర నాయకులు విడుదల చేసినట్లు తెలిపారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసి సంఘాలు పోస్టర్లు విడుదల చేసినట్లు తెలుస్తుందని విచారణ చేపడుతున్నామన్నారు.






### అంబేద్కర్ జయంతి నాటికి

# పనులు పూర్తి చేయాలి

- విగ్రహ ఏర్పాటుకు రేపటిలోగా సిద్ధం చేయాలి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని విగ్రహం ఏర్పాటు పనులను రేపటిలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐ.బి. చౌరస్తాలో కొనసాగుతున్న అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ నెల 14వ తేదీన బి.ఆర్. అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా విగ్రహ ఏర్పాటు పనులు వేగవంతం చేసి ఈ నెల 14వ తేదీన ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జయంతి వేడుకలలో భాగంగా నిర్వహించే కార్యక్రమాల సంబంధిత పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

**మందమర్రి, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

సింగరేణి యజమాన్యం ఆధ్వర్యంలో ఈ నెల 14న ఏరియాలో అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని సింగరేణి ఏరియా ఎస్ఓటు జిఎం విజయప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్ లు కోరారు. ఏరియాలోని విజయం కార్యాలయంలో అంబేద్కర్ జయంతి ఏర్పాట్లపై సింగరేణి ఏరియా అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని సింగరేణి అంబేద్కర్ గ్రీన్ పార్కు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించాలని, అదేవిధంగా అంబేద్కర్ జయంతి వేడుకలను సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించాలని సంబంధిత అధికారులకు సంఘం సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ లైసెన్ ఆఫీసర్ మైత్రేయ బందు, ఎస్టి లైసెన్ ఆఫీసర్ బాబు, డివైపిఎం ఎండి ఆసిఫ్ పాల్గొన్నారు.



# ఆధ్యాత్మికతతో జీవన శైలిలో మార్పు



**హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్,**

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

ఆధ్యాత్మికతతో జీవనశైలిలో మార్పు వస్తుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయం ఆవరణలో నిర్వహించిన హోమం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవలక్ష్మితో కలిసి కలెక్టర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆసిఫాబాద్ లో డిసిసి అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు, బిజెపి నేత వన్ నేషన్‌వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీలు మల్లికార్జున్, బాలేష్ గౌడ్, ఏఎంసి మాజీ చైర్మన్‌లు వెంకన్న ,మల్లేష్ పాల్గొన్నారు.నియోజకవర్గంలోని పలు మండలాలలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి రావి శ్రీనివాస్ వేడుకల్లో పాల్గొన్నారు. జయంతి సందర్భంగా హనుమాన్ ఆలయాలలు భక్తులతో కోలాహాలంగా కనిపించాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అంజన్నకు భక్తులు మొక్కలు చెల్లించారు.



### బీజేపీ ఆధ్వర్యంలో

# స్వచ్ఛత కార్యక్రమం

**మందమర్రి, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

మండలంలోని వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడి సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టి పాఠశాల ఆవరణలోని చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. బీజేపీ ఆవిర్భావ ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు గావ్‌చలో కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టి వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. గ్రామాలభివృద్ధికి, రహదారుల అభివృద్ధికి పెద్ద పీట వేసిందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో కలిసి ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గావ్ చలో జిల్లా కో కన్వీనర్‌సంజీవరావు, బీజేపీ మండల అధ్యక్షులు గిర్నాటి జనార్ధన్, మండల ప్రధాన కార్యదర్శి వంజరి వెంకటేష్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు శివకృష్ణ పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలన చూస్తే కార్పొరేట్లకు లాభాలు.. పేదాలపై భారాలు.. మోపే విధంగా ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆశన్న మండిపడ్డారు. గ్యాస్ సిలిండర్ ధరను రూ. 50 పెంచడాన్ని నిరసిస్తూ, పెంచిన ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం రణదివేనగర్‌లో గ్యాస్ సిలెండర్ కట్టెల పోయితో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు మంజుల, లంక జమున ఆశన్న, అర్ఫా బేగం, నగేష్, విజయ, తదితరులు పాల్గొన్నారు.



# హనుమాన్ శోభాయాత్రకు భారీ బందోబస్తు



- 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు వీడియో కెమెరాలు, డ్రోన్‌లతో ప్రత్యేక పర్యవేక్షణ
- సెక్టర్‌ల వారిగా విభజించి బందోబస్తు నిర్వహణ ర్యాలీ పూర్తి అయ్యేంతవరకు హనుమాన్ విగ్రహానికి ఇరువైపులా పోలీసు సిబ్బంది
- పోలీసు సిబ్బందికి ఉదయం నుంచే దిశానిర్దేశం చేసిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలోని పోలీసు సిబ్బందితో బందోబస్తు ప్రక్రియను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పర్యవేక్షించారు. శోభాయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణంలో 300 మంది సిబ్బందితో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. చేయడం జరిగిందని తెలిపారు. స్థానిక సెంట్రల్ గార్డెన్స్‌లో బందోబస్తు సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటుచేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. హనుమాన్ ర్యాలీ సందర్భంగా ప్రత్యేకంగా వీడియో కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసి బందోబస్తు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో సిబ్బందిని సెక్టర్ ల వారిగా విభజించి బందోబస్తు ప్రక్రియను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బందోబస్తులో ముఖ్యంగా శోభాయాత్ర సంచరించి దారి పొడవున ఉన్న భవనాలపై రూఫ్ టాప్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా ర్యాలీ జరుగు ప్రదేశాలలో ట్రాఫిక్ డైవర్షన్ ఏర్పాటు చేసినట్లు పట్టణంలోని అంతర్గత రోడ్లను వినియోగించుకోవాలని తెలిపారు. బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందని ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించు కోవాలని సూచించారు. శోభాయాత్ర జరగనున్న మార్గాల్లో ట్రాఫిక్ మళ్లించనున్నారు. గణేష్ నిమజ్జన ఊరేగింపుకు దీటుగా జరిగే అవకాశం ఉండడంతో దారి పొడవునా ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా.. యాత్రలో పాల్గొనే వారికి ఆటంకాలు ఎదురుకాకుండా పోలీసులను మోహరించారు. బందోబస్తు ఏర్పాట్ల గురించి అధికారులకు ఎప్పటికప్పుడు ఎస్పీ సూచనలు చేశారు. శనివారం హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా ముగియడంతో పోలీసుల సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ అడి షనల్ ఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సిహెచ్ నాగేందర్, రిజర్వ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు స ర్కిల్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.









# భక్తిశ్రద్ధలతో.. హనుమాన్ శోభాయాత్ర



## శోభాయమానంగా శోభాయాత్ర

- జిల్లా వ్యాప్తంగా మారుమోగిన ఆంజనేయ నామస్మరణ...
- భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శోభాయమనంగా శోభాయాత్ర
- శ్రీ భక్తాంజనేయ విగ్రహ పునః ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే..
- పల్లకి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్..
- తరలివచ్చిన అశేష భక్తజనం ■ పోలీసుల భారీ బందోబస్తు





**ఆదిలాబాద్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

హనుమాన్ జయంతి వేడుకలు శని వారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో హనుమాన్ విగ్రహ శోభాయాత్ర ఘనంగా చేపట్టారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠం మ ఠాధిపతి యోగానంద సరస్వతి స్వామితో కలిసి యాత్రను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి ఈ శోభాయాత్రకు హాజరైన అశేష భక్తజనంతో పట్టణం లోని పురవీధులు కిటకిటలాడాయి. జై హనుమాన్.. జై శ్రీరామ్ అంటూ నినాదాలతో మారుమోగింది. ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజాన్ భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. 300 మంది పోలీస్ బందోబస్తుతో సీసీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. డీఎస్పీలు శ్రీనివాస్, జీవన్ రెడ్డిలతో కలిసి ఎప్పటికప్పుడు సీసీటీవీ డ్రోన్ కెమెరాలలో బందోబస్తులు పర్యవేక్షించారు. బెజ్జూరు మండలంలో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బెజ్జూరు మండల కేంద్రంలో బైక్ ర్యాలీని ఎస్సై ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. అభయాంజనేయ ఆలయంలో హనుమాన్ జెండాను ఆలయ కమిటీ అధ్యక్షులు కొట్రంగి రామకృష్ణ ఎగరవేశారు. ఈ బైక్ ర్యాలీ బెజ్జూరు మండల కేంద్రం నుండి ఎలుక పెల్లి, చిన్న సిద్దాపూర్, బెజ్జూరు, నాగుల్వాయి, కృష్ణ పెల్లి గ్రామాల మీదుగా బెజ్జూరుకు చేరుకుంది. అనంతరం మండలం లోని హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారా యణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్న దాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాచకొండ శ్రీ వర్ధన్, ఆలయ కమిటీ అధ్యక్షులు తంగడపల్లి మహేష్, నాయకులు భోగ రమేష్, పుల్లూరు సతీష్, జిల్లాల సుధాకర్ గౌడ్, తంగడపల్లి నీలేష్, ఆది అశోక్, తదితరులు పాల్గొన్నారు. మం డల కేంద్రంలో నిలువెత్తు హనుమాన్ విగ్రహంతో శనివారం జయంతిని పురస్కరించుకొని విట్ట ళేశ్వర ఆలయం నుండి శోభయాత్ర ప్రారంభమైంది. ప్రత్యేక వాహనంలో డీజే చప్పుళ్ల మధ్య భక్తి పాటలతో యువత కేరింతలతో కొడుతూ ఎండను సైతం లెక్కచేయకుండా చేయ కుండా స్టెప్పులేశారు. ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహిం చారు. మండలం లోని గ్రామాల్లో ఆలయాలు పూజా కార్య క్రమాలతో భక్తులతో తొక్క కిటకిటలాడాయి. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల లకు సెలవు లేకపోవడంతో మధ్యాహ్నం నుండి ఆలయాల వదపిల్లలతో సందడి నెలకొంది.



**మంచిర్యాలలో..** హనుమాన్ జయంతి పురస్కరించుకొని మంచిర్యాల జిల్లా కేంద్రం లోని ఐబి చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ యాత్రను శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ యాత్రలో మంచిర్యాల మాజీ శాసన సభ్యులు నడిపెల్లి దివాకర్ రావు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మహేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



### హనుమాన్ జయంతి ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

మండల కేంద్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను ప్రతి కాపాడుకోవాలని అన్నారు. హనుమంతుడి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రపంచమంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ కాజల్, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నేతలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



### ప్రారంభోత్సవానికి

# సిద్ధమైన ఫ్లైఓవర్

**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

ప్రయాణికుల సౌకర్యార్థం క్యాతన్ పల్లి రైల్వే గేటుపై చేపట్టిన ఫ్లైఓవర్ బ్రిడ్జ్ త్వరలో అందుబాటులోకి రానున్నది. ఈ నెల 15న ఎంపీ గడ్డం వంశీకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ చేతుల మీదగా క్యాతన్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జ్‌ని ప్రారంభించనున్నట్లు టిపిసిసి సెక్రటరీ రఘునాథరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రారంభం పనులను సీఐ శశిధర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్‌లు పరిశీలించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే రోడ్డు దాటే ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా క్యాతన్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జ్ కి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును నామకరణం చేయాలని పలువురు నాయకులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు రాజు, సమ్మయ్య పాల్గొన్నారు.

### బెంబర్ గ్రామంలో

# అఖండ హరినామ సప్తాహ



**ముథోల్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

తానుర్ మండలం పరిధిలోని బెంబర్ గ్రామంలో శనివారం అఖండ హరినామ సప్తాహం ఆరంభమైంది. ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు సమష్టిగా నిర్వహించారు. యోగేష్ మహరాజ్ ఆధ్వర్యంలో భగవత్ కథ పారాయణం చేపట్టారు. ఈ సందర్భంగా మహారాజ్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగాలన్నారు. వారం రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో ప్రతిరోజూ భజనలతో పాటు పారాయణాలు, ఉపన్యాసాలు జరుగనున్నాయి. గ్రామంలోని భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

# హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

**బోథ్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పట్నాపూర్ గ్రామంలో నిర్వ హించిన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఏ పండుగ జరిగిన గ్రామ ఆడ పడుచులు ఎక్కడ ఉన్న గ్రామానికి విచ్చేసి గ్రామమంతా ఒకే దగ్గర పండుగలు జరుపుకోవడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం హనుమాన్ జయంతి సందర్భంగా బోథ్ మండల కేంద్రంలో నిర్వహించిన ఆంజనేయ స్వామి శోభయాత్రలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేసి యువకులతో కలిసి శోభయాత్రలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సంధ్యారాణి, మాజీ ఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్, బుచ్చన్న, ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల అడుగుజాడల్లో నడవాలి



### మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య, ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి జాన్సన్

**జన్నారం, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో నడవాలని వారు సమాజానికి చేసిన సేవలను గుర్తుంచుకోవాలని, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బిఆర్ఎస్ కానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి బుక్య జాన్సన్ నాయక్ అన్నారు. శనివారం జన్నారం మండల కేంద్రంలోని ఆర్ఆర్ఎస్ బంకట్ హాల్లో తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత ఆధ్వర్యంలో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ముందుగా మండల కేంద్రంలోని, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ తల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ నుంచి ఆర్ఆర్ఎస్, బంకట్ హాల్ వరకు డీజే సప్పులతో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ పూలే జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వాళ్ళు పాల్గొని మాట్లాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సావిత్రిబాయి పూలే, బాబు జగ్జీవన్ రాంలు అణగారిన సమాజ అభివృద్ధి కోసం వారు శాయశక్తుల కృషి చేశారన్నారు. అలాంటి మహనీయులను ప్రతి సంవత్సరం స్మరించుకోవడం తప్పనిసరి అన్నారు. ముగ్గురు మహనీయుల, జయంతి ఉత్సవాలను మండల కేంద్రాల్లో, అందుకు కారణమైన సాయిని ప్రసాద్ నేతను అభినందిస్తున్నామన్నారు.

# రక్తదానం మనహదానం




**మంచిర్యాల, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

భారత రాజ్యాంగ సృష్టికర్త, భారతరత్న అవార్డు గ్రహీత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని జైపూర్ పవర్ ప్లాంట్ ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడి) చిరంజీవి, డీజీఎం పంతులు నాయక్ రక్తదానం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆఫ్ ఓ అండ్ ఎం జేఎన్ సింగ్, ఏజీఎం మదన్మోహన్, డీజీఎం శ్రీనివాస్, ఏఐటీయూసీ సెక్రటరీ సత్యనారాయణ రెడ్డి, సిఎంఓ శ్రీనివాస్, వెంకటయ్య, ఎస్ఈ సురేష్, వైఆర్‌సిఎస్ సభ్యులు మధుసూదన్ రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, కే మాధవి, రజిత, రాజేష్, రవి వర్మ, శ్రీనివాస్ సుజాత పాల్గొన్నారు.

# హనుమాన్ ఆలయంలో పూజలు

**జన్నారం, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలోని పైడిపల్లి హనుమాన్ ఆలయంలో, హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా జక్కు సత్తయ్య అండ్ సన్స్, మాజీ సర్పంచ్ జక్కు భూమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన, హోమాలు యజ్ఞాలు కార్యక్రమంలో ఖానాపూర్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ జాన్సన్ నాయక్ పాల్గొన్నారు. ముందుగా హనుమాన్ ఆలయంలో, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు జాన్సన్ నాయక్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం జక్కు సత్తయ్య అండ్ సన్స్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రాజారాంరెడ్డి జనార్దన్ జాడి గంగాధర్ జక్కబుమేష్, సాయిని ప్రసాద్ నేత, ఫజల్ ఖాన్ వల్లాల నరస గౌడ్, రాజు బివిఎస్ నాయక్ పాల్గొన్నారు.





### ఎమ్మెల్యేను కలిసిన

# పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

**ఉట్నూర్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాది అబ్దుల్ రహీం జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా మరో న్యాయవాది ప్రవీణ్ కుమార్ పొక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. వీరిద్దరి పదవీకాలం మూడేళ్లపాటు ఉంటుంది. ఇదిలా ఉంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియమితులైన రమణా రెడ్డి, రహీంలు శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ నియమాకాలకు సహకరించినం దుకు ఆయనకు కృత్ఙతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వారిని సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

## జై బాపు, జై భీమ్, జై సంవిదాస్ ర్యాలీ

**తాండూర్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో ఐబీలో శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులు జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ సన్నహాక సమావేశం, ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని, అంబేద్కర్ గారు రాసిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. నాయకులు ఎండీ ఈసా, శంకర్, రాజేశం పాల్గొన్నారు.

# ఇనుప సామగ్రి చోరీ కేసును ఛేదించిన పోలీసులు




**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

రామకృష్ణాపూర్ పట్టణంలో ఓల్డ్ ఏరియా స్టోర్‌లో దొంగతననికి పాల్పడిన ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు మందమర్రి సీఐ శశిదర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే గత రెండు రోజుల క్రితం ఏరియా ఓల్డ్ స్టోర్ సింగరేణి అనుబంధ సంస్థ అయిన నీలిమ ఇండస్ట్రీస్ లో ఇనుప రాడ్లు దొంగతననికి గురైనట్లు శనివారం యజమాని చిటుకూరి మల్లేష్ ఫిర్యాదు చేశారు. ఏరియా ఆసుపత్రి మూలమలుపు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఆటో ట్రాలీ డ్రైవర్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వెంబడించగా వాహనంలో అనుమానస్పందంగా ఏడుగురు వ్యక్తులు ఉండగా వారిని అదుపులోకి తీసుకుని వాహనాన్ని తనిఖీ చేయగా సుమారు 60 ఇనుప రాడ్లును గుర్తించి స్టేషన్ కి తీసుకు వెళ్లి విచారించగా నీలిమ ఇండస్ట్రీస్ లో దొంగిలించినట్లు ఒప్పుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జంగు, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయిని తాగుతున్న వ్యక్తుల అరెస్ట్

**బెల్లంపల్లి, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

నెన్నెల మండలం జెండా వెంకటాపూర్ గ్రామలోని స్మశాన వాటిక వద్ద గంజాయిని సేవిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రసాద్ వెల్లడించారు. శనివారం గంజాయి తాగుతున్నరన్నా సమాచారం మేరకు సంబంధిత ప్రదేశానికి వెళ్లిన పోలీసులకు నలుగురు వ్యక్తులు గంజాయిని సేవిస్తుండడంతో వారిని అరెస్టు చేసి వారి వద్ద నుండి 250 గ్రాముల గంజాయితోపాటు ఒక రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ తోపాటు నాలుగు సెల్ ఫోన్ లను స్వాధీనపరుచుకున్నట్లు ఆయన వెల్లడించారు.అరెస్టు ఐన వారిలో జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఎనకూరి శశికుమార్, దుర్గం సిద్ధు, భీమారం మండలం కాజిపల్లికి చెందిన జాగతి మనోహర్, కుంటాల కీర్తి వర్ధన్ లను అరెస్టుచేసి కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయిని తాగిన, విక్రయించినా చట్టరీత్యా కఠినమైన చర్యలను తీసుకోవడం జరుగుతుందన్నారు.





# ఊబకాయంతో యమా డేంజర్

## భవిష్యత్ ప్రమాద ఘంటికలు

(ప్రభాత సమాచారం, న్యూస్ డెస్క్)

ఊబకాయం : ప్రస్తుతం అతిపెద్ద సమస్యగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా ఊబకాయుల సంఖ్య పెరుగుతోంది. దీంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. అయితే ఇందుకు వైద్యులు అనేక కారణాలు చెబుతున్నారు. భారత దేశంలో 2050 నాటికి భారతదేశంలో అధిక బరువుగల వారి సంఖ్య ఏకంగా 45 కోట్లకు చేరే అవకాశం ఉంది. ఈ సమస్య 15%-%24 ఏళ్ల యువతలోనూ, 5%-%14 ఏళ్ల పిల్లల్లోనూ వేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం చైనా, అమెరికా తర్వాత భారత్ ఊబకాయ సమస్యలో మూడో స్థానంలో ఉంది. 2021 గణాంకాల ప్రకారం దేశంలో 17.6 కోట్ల మంది అధిక బరువుతో ఉన్నారు. రాబోయే కొన్నేళ్లలో అమెరికాను అధిగమించి, ప్రపంచంలో ఊబకాయుల సంఖ్యలో భారత్ రెండో స్థానంలో నిలిచే అవకాశం ఉందని లాన్సెట్ జర్నల్ తెలిపింది.

**తెలుగు రాష్ట్రాల్లోలనూ..**

తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సమస్య వేగంగా విస్తరిస్తోంది. హైదరాబాద్ (Hyderabad)లోని ఐటీ ఉద్యోగుల్లో ఎక్కువ మంది స్థూలకాయంతో బాధపడుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితి మన దగ్గర ప్రమాద సంకేతాలు మోగిస్తోందని అర్థం చేసుకోవాలి. జీవన శైలి, వ్యాయామం లేకపోవడం, వేళాపాల లేకుండా తినడం వంటి కారణాలు ఊబకాయానికి కారణం అంటున్నారు.

**ఆహారంలో జాగ్రత్తలు - మైండ్‌ఫుల్ ఈటింగ్ కీలకం**

నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఊబకాయానికి ప్రధాన పరిష్కారం 'మైండ్‌ఫుల్ ఈటింగ్'. దీని కోసం కొన్ని సూత్రాలు పాటించాలి. ఆకలి వేసినప్పుడు మాత్రమే తినాలి. సమయం అయిందని అనవసరంగా ఆహారం తీసుకోవడం బరువు పెరగడానికి దారితీస్తుంది. ఒంటరితనం, బాధ లేదా కాలక్షేపం కోసం అతిగా తినడం మానాలి. భోజన సమయంలో టీవీ, మొబైల్ వంటి పరధ్యానాలు లేకుండా, ఏం తింటున్నామో, ఎంత తింటున్నామో శ్రద్ధగా గమనించాలి. ఆహారం రుచిని ఆస్వాదిస్తూ నెమ్మదిగా తినాలి. క్యాలరీలపై అవగాహన ఉంచాలి. ఒక పూట ఎక్కువ తీసుకుంటే, తర్వాతి పూట తగ్గించాలి. సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన జీవనశైలి, తగిన నిద్ర, ఒత్తిడి నియంత్రణ వంటివి ఊబకాయాన్ని అరికట్టడంలో సహాయపడతాయి.

**యువత, పిల్లల్లో ఊబకాయం..**

'వరల్డ్ ఒబేసిటీ ఫెడరేషన్' ప్రకారం, ప్రాసెస్డ్ మరియు ప్యాక్ చేసిన ఆహారాలు యువత, పిల్లల్లో ఊబకాయానికి ప్రధాన కారణం. అదనంగా, మొబైల్ ఫోన్లు, టీవీలకు అతిగా అలవాటు పడడం, ఆటస్థలాల్లో శారీరక ఆటలు తగ్గిపోవడం కూడా ఈ సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి.

### ఊబకాయం అంటే ఏమిటి?

శరీరంలో కొవ్వు అధికంగా పేరుకుపోతే దాన్ని ఊబకాయం అంటారు. దీన్ని బాడీ మాస్ ఇండెక్స్ ద్వారా కొలుస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం..

- 18.5 కన్నా తక్కువ: తక్కువ బరువు
- 18.5-24.9: సాధారణ బరువు
- 25-29.9: అధిక బరువు
- 30 కన్నా ఎక్కువ: ఊబకాయం

### ఊబకాయానికి కారణాలు

- జన్యుపరమైన అంశాలు
- అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు
- శారీరక శ్రమ లేకపోవడం
- వాతావరణ కారణాలు
- కొన్ని ఔషధాల వాడకం

ఊబకాయం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు

అధిక బరువు ఉన్నవారికి ఇతర ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉంది :

- టైప్-2 మధుమేహం
- అధిక రక్తపోటు
- గుండె జబ్బులు - ఫ్యాటీ లివర్
- మానసిక ఆరోగ్య సమస్యలు
- మహిళల్లో గర్భధారణ సమస్యలు



# దళితుల ఆత్మగౌరవ పోరాట యోధుడు -డాక్టర్ బీఆర్ అంబేద్కర్

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, దానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన పని రాజ్యాంగ రచన. ఈ గొప్ప బాధ్యతను నిర్వహించిన వ్యక్తి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్. అతను కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదు, సామాజిక న్యాయ యోధుడు, విద్యావేత్త, రాజకీయ నాయకుడు సంఘ సంస్కర్త సమ సమాజ స్థాపకుడు. సమాజంలోని కుల వివక్షతను నిర్మూలించుటకై నిరంతరం విద్యాభ్యాసం చేస్తూ పోరాటం చేసిన మహనీయుడు. బాబాసాహెబ్ 1891లో మధ్యప్రదేశ్ లోని మహూర్ లో జన్మించారు. అస్పృశ్య కుటుంబంలో పుట్టినందున బాల్యం నుంచే జాతి వివక్షను ఎదుర్కొన్నారు. అయితే, విద్యపట్ల గల ఆసక్తి వలన ముంబైలో ఎల్ఫిన్స్టన్ కళాశాలలో చదివారు. తర్వాత అమెరికా, ఇంగ్లాండ్లో ఉన్నత విద్యను పూర్తిచేసి, డాక్టరేట్ పట్టా పొందినరాజ్యాంగమూర్తి. భరతమాత గౌరవాన్ని భావితరాలకు తెలియజేసిన మహనీయుడు మన అంబేద్కరుడు. సామాజిక సమానత్వం కోసం పోరాటంచేసి అంబేద్కర్ తన జీవితాంతం హిందూ సమాజంలోని అస్పృశ్యత, జాతి వ్యవస్థ వంటి అన్యాయాలను ఖండించారు. దళితుల హక్కుల కోసం సవాల్ చేస్తూ, 'దళిత బౌద్ధ ఉద్యమం'ను ప్రారంభించారు.

'భారతమాతకు గారాలపట్టివయ్యి
కొత్తరాజ్యాంగ నిర్మాణవేత్తయనగ
విశ్వవిఖ్యాతిగాంచిన వీరవర్య!
దళితదీన సంరక్షకాధర్మమూర్తి!

రాజకీయమూర్తి 1947లో భారత స్వాతంత్ర్యం తర్వాత, రాజ్యాంగ రచనా కమిటీకి అధ్యక్షుడిగా నియమించబడి. మీ నేతృత్వంలో, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం ఆధారంగా భారత రాజ్యాంగం రూపొందించబడింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, మౌలిక విధులు, రాష్ట్ర విధాన నిర్దేశక సూత్రాలు అంబేద్కర్ దూరదృష్టిని ప్రతిబింబిపజేశాయయి. అంబేద్కర్ భారతదేశంలో మహిళా హక్కులు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు రిజర్వేషన్లు, కార్మిక హక్కులువంటి సంస్కరణలకు నాంది పలికారు. అతను భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) స్థాపనలో కూడా కీలక పాత్ర పోషించిన అంబేద్కర.



ఏప్రిల్ 14
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి

నిదుప్రతిమల గ్రామాలనిలుపుకోనుచు, నిదుప్ర
తిభనుపెట్టిరి నిలువ లోతు, దళిత జనసేవ జేయు
విధానమెల్ల
విగ్రహములను నిలిపెదు వేడ్కయయ్యో!

బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితం సామాజిక న్యాయం, విద్య, రాజకీయ సాధికారతకు ప్రతీక. అతని సిద్ధాంతాలు నేటి మన భారతదేశంలో గ్రామ గ్రామాన మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

*చూదుము నేదు భారతయశోవిభవంబును,
నీసదాశలే
వీడిరాజకీయలగువేత్తలు, శ్రామికులైనయట్టిమా
పీడిత కష్టజీవులను వేదనబెట్టుచు కాల్పంపకా
పాడెడిదిక్కులేకబలుబాధలనుండిమికింపుమో!

భారతదేశపు వైభవాన్ని, సమాజంలోని రాజకీయ నాయకుల, శ్రామికుల వైఖరిని, పీడిత ప్రజల పరిస్థితిని మహిమాన్వితమైన దేశమని. కానీ ఈ వైభవం ఇప్పుడు కేవలం చూపించేందుకే మిగిలిపోయింది. రాజకీయం చేసిన వారు దేశాన్ని తలపెట్టిన బాధ్యతలను వదిలేసి తమ స్వార్థానికి పని చేస్తున్నారు. పీడిత ప్రజలు తమ జీవన పోరాటాల్లో బాధపడుతూ, అవమానాలను అనుభవిస్తున్నార అటువంటి ప్రజలకు ఎలాంటి దిక్కూ, సహాయమూ లేకపోవడం వల్ల వారు అత్యంత దయనీయ స్థితిలో అంబేద్కర్ భావజాలం మాత్రమే ఈ సమాజం వివక్షత నుండి ప్రజలను కాపాడగలుగుతుంది. సమకాలీన రాజకీయ మరియు సామాజిక పరిస్థితులను ఎదుర్కొనలేక, బాధపడే ప్రజల పట్ల దయతో కూడిన హృదయాన్ని కలిగి ఉండాలని, నాయకులు తమ బాధ్యతలను గుర్తుంచుకోవాలని కోరుకుంటున్నాము.

*ఆబడాయిగడ్డితండాలోయతివలెల్ల
బోరుబోరునవిలపించుఘోరమునకు నీదురా
జ్యాంగపరిధిలోనీవడేయది
దారిచూపు అంబేద్కరా! దళిత మూర్తి!

ప్రజలు బాధల్లో ఉన్నా, పాలకులు పట్టించుకోరు. రాజ్యాంగం ప్రజలకు మేలు చేసే విధంగా అమలు కావడం లేదు. దానికి కారణం రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకొని నాయకులు రాజకీయ పదవులు అనుభవిస్తున్నారు కానీ అనగారిన వర్గాలకు కావలసిన విధంగా విద్యా వైద్య ఉద్యోగ సదుపాయాలు కల్పించడంలో నాయకుల విఫలమవుతున్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని గౌరవిస్తూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిన రోజు మాత్రమే అంబేద్కర్ ఆశయాలు నెరవేర్చినట్లు అవుతుంది. అంబేద్కర్ ఆశయ సాధన కోసం బడుగు బలహీన వర్గాలు ఇంకా పోరాటం చేయవలసిన అవసరం ఆవశ్యకత ఉంది. అంబేద్కర్ రచనల్లో సామాజిక సమానత్వం ప్రధానాంశంగా నిలిచింది. 'అనిహితులు (Annihilation of Caste)' అనే రచన భారతీయ సాంప్రదాయ వ్యవస్థపై తీవ్ర విమర్శ. ఈ రచన సాహితీ రంగంలో ఒక విప్లవాత్మక సంఘటనగా భావించవచ్చు. వర్ణవ్యవస్థను శాస్త్రీయంగా, తాత్వికంగా విపక్షిస్తూ, ఆయన సమాజాన్ని మార్చే ప్రయత్నం చేశారు. అంబేద్కర్ చివరికి బౌద్ధ మతాన్ని ఆశ్రయించడం ద్వారా తాను నమ్మిన 'సామాజిక న్యాయం' సిద్ధాంతాన్ని కార్యరూపంలోకి తెచ్చారు. ఆయన రచించిన 'The Buddha and His Dhamma' గ్రంథం బుద్ధ సిద్ధాంతాన్ని సామాజిక సమానత్వం దృష్టికోణంలో అర్థం చేసుకునే ప్రయత్నంగా చెప్పవచ్చు. అంబేద్కర్ రచనల్లో రాజ్యాంగ సంబంధిత అంశాలు, రాజ్యాంగ పరిష్కారాలు అత్యంత సాంఘిక స్పృహతో కూడినవి. ఆయనే ప్రధానంగా భారత రాజ్యాంగ రూపకర్తగా నిలిచారు. ఆయన రచనలు ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై ఆధారపడినవిగా ఉండగా, వాటిలో ఉన్న నైపుణ్యం సాహితీ పరంగా విశ్లేషణకు అర్హమైనది. అంబేద్కర్ రచనలు స్పష్టత, నైతిక స్థైర్యం, శాస్త్రీయ విశ్లేషణతో ప్రసిద్ధి చెందాయి. ఆయన రచనలు వాక్య నిర్మాణంలో నైతికతను, భావావేశాన్ని మేళవించినవి. వ్యక్తిగత అనుభవాలు, సామాజిక స్థితిగతులపై ఆధారపడిన ఆయన రచనలు చదివే వారిలో చైతన్యం కలిగిస్తున్నప్పటికీ, ఇంకా తక్కువజాతిగా ముద్ర వేయబడిన వారు, సమాజంలో పూర్తి గౌరవాన్ని పొందలేకపోతున్నారు. ఇంకా వారిపై నిందలు, హింసలు జరుగుతూనే ఉన్నాయి. వారు బాధపడుతాడు, చివరకు హింసకు బలైపోతున్నారు. కాబట్టి, ఓ దళితులారా మనం కూడా ఈ బాధల



నుండి విముక్తి పొందాలంటే అంబేద్కర్ ఆశయ సాధనలో ఉద్యమించాలి. దళితుడు అత్యున్నత అధికార స్థానానికి చేరుకునే వరకు సమాజంలో ఉన్న కుల ఆధారిత వివక్ష నుండి విముక్తి వచ్చేంతవరకు, అంటే, ఒక్క రాజకీయ లేదా అధికారంలో ఉన్న స్థితి మాత్రమే సరిపోదు సమాజం మనోభావాలు మారాల్సి ఉంది. విద్యలేని, శక్తిలేని దళితుడు (నిమ్న జాతి వ్యక్తి) ఏ స్థాయికి ఎదిగినా, అణచివేత నుండి బయటపడలేదు. విద్యలేని వారికి ఈ దారిలో గాని ప్రగతి లేదు. అంటే, విద్య లేకపోతే మనం మరింతగా దోపిడీకి గురవుతున్నం ఒకటి అధికారం, మరొకటి నిరక్షరాస్యతపై దృష్టిసారించడం మనముందు ఉన్న సవాలు. అధికారం ఉన్నా హింస, బాధలు మన దళిత జాతికి తప్పడం లేదు. కాబట్టి, దళితులను విముక్తం చేయాలంటే సామాజిక మానసిక ధోరణుల మార్పుతో పాటు, విద్య, శక్తి, స్వీయ గౌరవం చాలా అవసరమన్నది సందేశం. 'నేను మతాన్ని బట్టి మానవత్వాన్ని పరిగణించను. సమానత్వం లేని సమాజం నాకు సజీవ శవం అనిపిస్తుంది.'డాక్టర్ బీఆర్. అంబేద్కర్ అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకై కృషి చేయవలసిన బాధ్యత నేటి సమాజంలోని బడుగు బలహీనవర్గాల యువతరంపై ఎంతగానో ఉంది.

## తప్పిన ఘోర ప్రమాదం
# ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ



■ 15 మంది ప్రయాణికులకు గాయాలు
■ తీవ్రంగా గాయపడిన బస్సు డ్రైవర్, కండక్టర్
■ క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్
■ జేసీబీతో బయటకు తీసి ఆస్పత్రికి తరలింపు
■ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి..







**నిర్మల్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
మండలంలోని తురాటి గ్రామ ఎక్స్ రోడ్డు వద్ద 61వ జాతీయ రహదారి వద్ద శనివారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణికులకు గాయాలు, బస్సు డ్రైవర్ లతీఫ్, కండక్టర్ జంగం సుధారాణికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు లోకేశ్వరం మండలం రాజురా నుంచి నిర్మల్ వెళ్తుంది. నిర్మల్ నుంచి కెమికల్ లోడ్‌తో భైంసా వైపు వెళ్తున్న లారీ ఓవర్టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. ప్రమాద సమయంలో బస్సులో 37 మంది ప్రయాణికులు ఉండగా 15 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నిర్మల్, భైంసా ఏరియా ఆసుపత్రులకు తరలించారు. లక్ష్మి, భోజవ్వ, గంగవ్వ, రాజేశ్వరి, గణేశ్, సరస్వతి, సజన్ తదితరులు చికిత్స పొందుతున్నారు. లారీ క్యాబిన్‌లో డ్రైవర్ గజ్జల శ్రీను ఇరుక్కుపోయి గంటసేపు నరకయాతన అనుభవించాడు. జేసీబీ సాయంతో బయటకు తీసి 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు లారీ డ్రైవర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల వాసిగా గుర్తించారు. నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, ఎస్సై సాయికిరణ్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. నిర్మల్ డిపో మేనేజర్ పండరి, ఆర్టీసీ అధికారులతో ఘటన స్థలాన్ని పరిశీలించారు.





## ప్రాణాలు తీసిన
# చేపల వేట

■ ప్రమాదవశాత్తు వాగుకుంటలో పడి ఇద్దరి మృతి
■ మృతులిద్దరూ బావ బామ్మర్దులు
■ మృతులు నిర్మల్ జిల్లా వాసులు

**నిర్మల్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
చేపల వేట సరదా ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ప్రమాదవశాత్తు బావ బామ్మర్దులు ఇద్దరు నీట మునిగి చనిపోయిన ఘటన నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం సిద్దాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లాకు చెందిన షేక్ షాదుల్లా(46) తన కుటుంబంతో కలిసి 18 ఏళ్ల క్రితం ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి వచ్చి మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కడప జిల్లా పొద్దుటూర్‌కు చెందిన అతని బావమరిది మహమ్మద్ రఫీక్ (47) రంజాన్ పండుగ సందర్భంగా వారం క్రితం మచ్చర్లకు వచ్చాడు. కాగా, శుక్రవారం సాయంత్రం సరదాగా చేపలు పట్టేందుకు ఇద్దరూ కలిసి నందిపేట మండలంలోని సిద్దాపూర్ శివారులోని చిన్నవాగు సంబంధించిన మునికుంటకు వెళ్లారు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు రఫీక్ కాలుజారి కుంటలో పడిపోయాడు. దీంతో అతనిని రక్షించేందుకు షాదుల్లా కుంటలోకి దిగాడు. ఇద్దరికీ ఈత రాకపోవడం, మునికుంటలోలోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి మృతి చెందారు. ఒకరిని కాపాడబోయి మరొకరు మృతి చెందారు. మృతుడు షేక్ షాదుల్లా కొడుకు షేక్ సులేమాన్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇద్దరు మృతితో నిర్మల్ జిల్లాతో ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# బ్యాంక్‌కు కన్నం వేసిన దొంగల ముఠా అరెస్ట్






■ వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
జల్సాలకు అలవాటుపడి గత ఏడాది డిసెంబర్ 12న ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని రామాయి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు కన్నం వేసి లోపలికి ప్రవేశించి దొంగతనానికి యత్నించిన దొం గల ముఠాలో పలువురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. రామాయి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో గత ఏడాది డిసెంబర్‌లో 9 మంది యువకులు దొంగతనా నికి ప్రయత్నం చేశారన్నారు. బ్యాంకులో అమర్చిన మోషన్ డిటెక్షన్ అలారాం సైరన్ రావడంతో దొంగతనం విఫ లమై, పారిపోయారని తెలిపారు. ఈ కేసులో 9 మంది దొంగలు నేరానికి పాల్పడగా, అందులో ముగ్గురు వ్యక్తులను శనివారం ఆదిలాబాద్ గ్రామీణ మండలం కచ్‌కంటి గ్రామ శివారులో పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించి పట్టుబడి నేరం అంగీకరించారని పేర్కొన్నారు. వారి వద్ద నుండి బ్యాంకు దొంగతనానికి ఉపయోగించిన గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్, గడ్డపార స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులలో కీలక సూత్రధారి, చవాన్ రవి (సుపారి మర్డర్ కేసులో నిందితుడు), ప్రస్తుతం వేరే కేసులో అరెస్టై జైల్లో ఉన్నాడని, ఇతను దుర్గనగర్ తాజా మాజి కౌన్సిలర్ రఘుపతితో పాటు ఒక హత్య యత్నం కేసు, జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో దొంగతనం కేసులలో జైలుకి వెళ్లినట్లు స్పష్టం చేశారు. ఏ2) సన్నీ ఏ సుక్దేవ్ సన్నీ ఇతను కూడా ప్రస్తుతం వేరే కేసులో అరెస్టై జైల్లో ఉన్నాడని తెలిపారు. ఏ3పుష్ప ఏ పవన్ (పరార్)లో ఉండగా, 4) గోవిందుడు కార్తీక్ ఏ గోల్డెన్ కార్తీక్, దగడ్ సాయిలు అరెస్ట్ ఐ జైలుకు వెళ్లారని, ఏ6) మణికంఠ, ఏ7) జాదవ్ రాజు లు ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు. కేఆర్ కే కాలానికి చెందిన 8) అశోక్ ఏ ఆశ, ఏ9) మినుగు రాజేశ్వర్ రాజేష్‌లను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. 9 మందిపై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఇందులో ముగ్గురు అరెస్టు, ముగ్గురు పరారీలో ఉండగా మరో ముగ్గురిని వ్యవహరించిన పోలీస్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారన్నారు. వీరు జైల్లో ఉన్నారని తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి, సీసీఎస్ సీఐ చంద్ర శేఖర్, రూరల్ సీఐ ఫణిధర్, ఎస్సై ముజాహిద్, సీసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కన్న కొడుకునే కడతేర్చిన తండ్రి?

■ విద్యుత్ షాక్ పెట్టి చంపేసి..
■ వాగులో పడేసి పోలీసులకు ఫిర్యాదు
■ ఆస్తి వివాదమే కారణమని ప్రచారం



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
మండలంలోని టోంకిని గ్రామానికి చెందిన చౌదరి జయేందర్(19)ను భూ పంపిణీ వివాదంలో కన్న తండ్రే కడతేర్చాడనే ప్రచారం జరుగుతోంది. గతకొంత కొంతకాలంగా భూమి, ఆస్తులపై వివాదం ఉండడమే అందుకు కారణంగా తెలుస్తోంది. ఈ నెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమారుడు జయేందర్ తిరిగి రాలేదని తండ్రి చౌదరి చిరంజీవి సిర్పూర్(టి) పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈనెల 10న పోలీసులు విచారణ చేపట్టగా యువకుడి ఆచూకీ లభించలేదు. శని వారం ఉదయం హనుమాన్ జయంతికి టోంకిని హనుమాన్ ఆలయానికి వచ్చిన భక్తులు పెన్ గంగ నదిలో స్నానానికి వెళ్లగా మృతదేహం కనిపించింది. సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి జ యేందర్ తల్లిదండ్రులను పిలిచి విచారించగా తమ కుమారుడే అని గుర్తించారు. కాగా, ఈనెల 10న టోంకిని సమీపంలోని తమ స్వంత పొలంలో అడవి పందులు రాకుండా విద్యుత్తు వైర్లు అమర్చగా ప్రమాదవశాత్తు తగిలి జయేందర్ మృతిచెందాడని, తమపై కేసులు నమోదు అవుతాయనే భయంతో సమీపంలో ఉన్న పెన్ గంగలో మృతదేహాన్ని పడవేసి పోలీసుస్టేషన్లో అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారనీ ప్రచారం జరుగుతోంది. మంచిర్యాల ఫోరెన్సిక్ వైద్య నిపుణులతో పోస్టుమార్టం నిర్వహించామని, ఆదివారం పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.



## రైతన్న కష్టం బుగ్గిపాలు

### మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి

**ఇచ్చోడ, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
మండలంలోని దుబారపేట్ గ్రామానికి చెందిన రైతు హోరన్ సుభాష్‌కు చెందిన జొన్న పంట అగ్నికి ఆహుతి అయింది. రెండు ఎకరాలలో వేసిన జొన్న పంట చేతికి వచ్చిన సమయానికి అగ్నికి ఆహుతయ్యింది. ప్రమాద వశాత్తు జరిగిందా.. లేదా ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కావాలని పంటకు నిప్పు పెట్టారా తెలియదు కాదు.. పంట మొత్తం కాలి బుడిదయ్యింది. రూ.లక్ష పైచిలుకు నష్ట వాటిల్లిందని బాధితుడు ఆవే దన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కన్నీరు పెట్టాడు.

## హరినామ సప్త ఆహ్వానం



**ఇచ్చోడ, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
ఇచ్చోడ మండలంలోని నవేగావ్ గ్రామంలో శనివారం నిర్వహించిన అఖండ హరినామ సప్త కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను గ్రామ స్తులు ఆహ్వానించారు. దీంతో ఆయన ఖండ హరినామ సప్తహ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని భక్తి మార్గంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

### శోభాయానమానంగా

## హనుమాన్ శోభాయాత్ర

**ఇచ్చోడ, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా ఇచ్చోడ మండల కేంద్రంలో శనివారం హనుమాన్ శోభాయాత్ర కోలా హలంగా సాగింది. విశ్వహిందూ పరిషత్, బజరం గ్‌దళ్, ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శోభా యాత్ర సాగింది. శ్రీరాముడు, హనుమంతుడి విగ్రహాలను వాహనాలపై కొలువుదీర్చి ద్విచక్ర వాహనాల్లో హను మాన్ భక్త బృందం ర్యాలీగా తరలి వెళ్లారు. అడుగ డుగునా ప్రజలు దీపాలతో హారతులు ఇచ్చారు. పూల వర్షం కురిపించారు. మంగళవాయి ద్యాలు, జై హను మాన్, జై శ్రీరామ్ నామస్మరణ, విచిత్ర వేషధారణలు, కోలాటాలు, ఆధ్యాత్మిక గీతాలాపనలు, బాణసంచా పేలుళ్ల మధ్య హనుమాన్ శోభాయాత్ర సాగింది. శోభా యాత్రలో పాల్గొనేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. శోభాయాత్రలో పాల్గొన్న వారికి తాగు నీరు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. శోభాయా త్రలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ భీమేష్ ఎస్సై తిరుపతి బందోబస్తు ఏర్పాటు చేశారు.



# పిల్లలను బాగా చదివించాలి : ఏఎస్పీ చిత్తరంజన్

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
మానవ అభ్యున్నతికి విద్య మూలమని ఏఎస్పి చిత్తరంజన్ అన్నారు. శనివారం తిర్యాణి మండలంలోని మంగి, కొలం గూడ గ్రామాలను సందర్శించారు. గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలను చదివించాలని తద్వారా అభివృద్ధి చెందుతారని తెలిపారు. విద్య వైద్యం అవ సరాల కోసం పోలీసులు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందు టారని తెలిపారు. నిషేధిత గంజాయి సాగును చేయవద్దని, అపరిచిత వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీస్ లకు తెలుపాలని కోరారు. యువత మావోయిస్టుల వైపు ఆకర్షితులు కావద్దని అన్నారు. చిన్నారులతో ప్రేమగా మాట్లాడుతూ వారికి పలకపై అక్షరాలను రాసి చదివించారు. పిల్లలకు పలకలు, బిస్కెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## దాహార్తి తీర్చేందుకే అంబలి పంపిణీ

### లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబైద్ బిన్ యహియా

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రతి సంవత్సరం వేసవిలో అంబలి పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబైద్ బిన్ యహియా శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగు తున్న క్రమంలో బాటసారులకు, ప్రయాణికులకు, ప్రజలకు అంబలి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పేద ప్రజలకు ఆకలి, దాహం, తీర్చడంతో నాకు ఎంతో తృప్తినిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రమణ రెడ్డి, వినాయక్ రావు, పుల్లూరి శంకర్, భీమ్ రావు, విశాల్ ఖాండ్రే, ముబాషీర్, గులాం జావిద్, మాస్, ఫురాన్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.




## చలో వరంగల్ పోస్టర్ల ఆవిష్కరణ



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
ఈ నెల 27న వరంగల్ ఎక్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభను జయప్రదం చేయాలని బిఆర్ ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. శనివారం క్యాతన్ పల్లిలోని తన నివాసంలో చలో వరంగల్ పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లా డారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహా సభ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వ ర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి వరంగల్ సభకు రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సభకు నాయకులు, కార్య కర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో చెన్నూరు నియో జకవర్గ ఇంచార్జ్ డాక్టర్ రాజా రమేష్, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, పల్లె భూమేష్, వాలా శ్రీని వాసరావు, రిక్కుల మధుకర్ రెడ్డి, మేడి తిరుపతి, వేల్పుల రవి, రాంలాల్ గిల్డా, జాడి శ్రీనివాస్, రామిడి కుమార్, రెవెళ్లి ఓదె లు, అనిల్ రావు, గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల గావ్ ఛలో, బస్తీ ఛలో




**మంచిర్యాల, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
సింగరేణి ప్రాంతంలో వేల కోట్ల రూపాయలు ఆదాయం ఉన్న ప్పటికీ నస్పూర్ ప్రాంతం అభివృద్ధి మాత్రం చెందటం లేదని బీజేపీ సీనియర్ నాయకులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. బీజేపీగావ్ ఛలో, బస్తీ ఛలో కార్యక్రమంలో భాగంగా శని వారం నస్పూర్ మున్సిపాలిటీలోని సీతారాంపల్లిలో పట్టణ అధ్యక్షులు సత్రం రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన బస్తీ ఛలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. సీతారాంపల్లిలో ముఖ్యంగా డ్రైనేజీ, త్రాగు నీరు, రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని, సింగరేణి ప్రాంతంలో వేల కోట్ల రూపా యలు ఆదాయం ఉన్నప్పటికీ ప్రాంతం అవివృద్ధి మాత్రం చెందటం లేదన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 6 గ్యారెంటీల పేరుతో పెన్షన్ల పెంపు, మహిళలకు రూ. 2500, విద్యార్థినీలకు స్కూటీలు, కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం వంటి 420 హామీలు ఇచ్చి పేద ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఆకుల అశోక్ వర్ధన్, జీవీ ఆనంద్ కృష్ణ, సత్రం రమేష్, పానుగంటి మధు, మిట్టపల్లి మొగిలి, ఈర్ల సదానందం, కుర్రె చక్రి, పానవేని సదయ్య, ఆకుల నరేందర్, జాడి తిరుపతి, మద్ది సుమన్, మాడిశెట్టి మహేష్, కట్కూరి తిరుపతి, దేవేందర్, చల్లా విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.



### అగ్ని ప్రమాద బాధితులకు

## మిత్రుల చేయూత

**ముథోల్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
అగ్ని ప్రమాద బాధితులకు మిత్ర బృందంచే విరాళాలు పంపిణీ చేశారు. కుంటాల మండలం ఓలా గ్రామానికి చెందిన మిత్రుల వ్యాపార కేంద్రాలు అగ్ని ప్రమాదానికి ఆహుతి అయ్యాయి. మిత్ర బృందం శ్రీనివాస్, అశోక్ కుమార్, శేఖ్ హుస్సేన్, గాజుల దేవి శ్రీనివాసులు రూ. 75000లు సహాయంగా శనివారం అందజేశారు. ఇందు లో శ్రీనివాస్ గౌడ్, కట్ట రవి, పూల శంకర్ నర్సయ్య ఉన్నారు. యువ చైతన్య యూత్ సభ్యులు ఉన్నారు.

### కొనుగోలు కేంద్రం

## ఏర్పాటుకు స్థల పరిశీలన



**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
బజార్హత్నూర్ మండల కేంద్రంలో జొన్నల కొనుగోలు కేం ద్రం ఏర్పాటు కోసం శనివారం ఆదిలాబాద్ పీఏసీఎస్ సీ ఈవో రాజశేఖర్, పీఏసీఎస్ ఛైర్మన్ మేకల వెంకన్న యా దవ్, మండల రైతులతో కలిసి స్థల పరిశీలన చేశారు. చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. వారం రోజుల్లో కొ నుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. రైతుల కు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేపడతామన్నారు.

## భక్తులకు పండ్ల పంపిణీ

**మంచిర్యాల, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నస్పూర్ మున్సి పాలిటీలోని హనుమాన్ ఆలయాలలో, ప్రధాన రహదారి వెంబడి వెళ్తున్న పాదాచారులకు వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పండ్లు పంపిణీ చేశారు. ప్రధానంగా కొండగట్టుకు నడిచి వెళుతున్న హనుమాన్ భక్తులకు, పాదాచారులకి ఇందారం క్రాస్ రోడ్ వద్ద, వివిధ హనుమాన్ ఆలయాలలో మజ్జిగ, వాటర్ బాటిల్స్, పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఎన్ఆర్ ఫౌండేషన్ సభ్యులు మల్లెత్తుల రాజేంద్రపాణి-రజిని, రేగండ్ల ఉపేందర్-స్వాతి, సందినేని సతీష్ - మౌనిక, గోపతి తిరుపతి - సుమలత పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్






**మందమర్రి, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమ లు చేస్తుందని, ప్రజలు సద్విని యోగం చేసు కోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. మండలంలోని వెం కటాపూర్ గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు గావ్ చలో కార్యక్ర మాన్ని మండల అధ్యక్షుడు గిర్నాటీ జనార్ధన్ ఆధ్వర్యంలో ని ర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్య క్షుడు పాల్గొ న్నారు. గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శిం చారు. అనంతరం స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమాలను చేప ట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర పథకాలతోనే ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. అనంతరం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరావు, శివకృష్ణ, వంశీగౌడ్, రంజిత్, శ్రీనివాస్, రవికుమార్, రాజయ్య, బుచ్చన్న పాల్గొన్నారు.

**ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి**

**మంచిర్యాల, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
ప్రజలకు మౌలిక సదుపా యా లను కల్పించి సమస్యలను సత్వమే పరిష్కారం చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. నస్పూర్ లోని సీతా రాంపల్లిలో శనివారం గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహిం చారు. గ్రామంలోని రేషన్ షాపును సందర్శించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ సీతారాంపల్లిలో ము ఖ్యంగా మురుగు కాలువలు, తాగునీరు, రోడ్ల సమస్యలు ఉన్నాయన్నారు. సింగరేణి ప్రాంతమైన కోట్ల రూపాయల ఆదాయం ఉన్న ప్రాంతం అభివృద్ధిపై శ్రద్ధ చూపడంలేదన్నా రు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల అశోక్ వర్ధన్, ఆనంద్ కృష్ణ, రమేష్, పానుగంటి మధు, మిట్టపల్లి మొగిలి, ఈర్ల సదానందం, కుర్ర చక్రవర్తి, పొనగంటి సదయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీల్లో 'పోలీస్ అక్క'

**నిర్మల్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న వారంతా పేద, మధ్య తరగతి కుటుంబలకు చెందిన బాలికలే. గ్రామీణ ప్రాంతాల్లో, అణగారిన వర్గాల్లో లింగ అసమానతలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దీ నిని నివారించేందుకు నిర్మల్ పోలీస్.. మీ పోలీస్.. అంటూ ఎస్పీ జానకీ షర్మిల పోలీస్ అక్క కార్యక్రమా నికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆడపిల్లల సమస్యలను దగ్గరుండి అర్థం చేసుకుంటారనే ఉద్దే శంతో రాష్ట్రంలోనే తొలిసారి జిల్లాలోని 18 పాఠశా లలకు 18 మంది మహిళా కానిస్టేబుళ్లను పర్యవేక్షణ అధికారులుగా నియమించారు. ఒక్కో పాఠశాలలను ఒక్కో మహిళ కానిస్టేబుల్ దత్తత తీసుకున్నారు.

**రాత్రి బస..**
మహిళా పీసీలు విద్యార్థులతో కలిసి రాత్రి బస చేస్తా రు. ఇందులో భాగంగా శనివారం రాత్రి విద్యార్థినిలతో కలిసి బస చేశారు. వారితో కలిసి ముచ్చటించారు. వారితో కలిసే భోజనం చేశారు. సమస్యలు తెలుసుకు న్నారు. వార్షిక పరీక్షల గురించి చర్చించారు. పరీక్షలు ఎలా రాయాలి.. ఎలా ప్రిపేర్ కావాలి.. అనే విషయా లు తెలియజేశారు. విద్యార్థినుల్లో ధైర్యం నింపారు.

# మహిళా సంఘం అధ్యక్షురాలుగా బ్యారప్ లక్ష్మి



**కుభీర్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
మహిళా సంఘాలను అభివృది పరిచ్చేందుకు తన వంతుగా కృషి చేస్తానని మహిళా సంఘ అధ్యక్షరాలు బ్యారప్ లక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ఫార్డి బి గ్రమైక్య సంఘం 1 సభ్యుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్బంగా గ్రమైక్య మహిళా సంఘ సభ్యులందరు కలసి నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఇందులో అధ్యక్షరాలుగా బ్యారప్ లక్ష్మి ఉప అధ్యక్షురాలుగా అతగాలే కంత బాయి కార్యదర్శిగా గాయక్ వాడ్ జ్యోతి కోశాధికారిగా గుమ్మల లావణ్య మిగితా మంది సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్ను కున్నాట్లు అధ్యక్షురాలు తెలిపారు. దింతో సంఘం సభ్యులకు రుణాలు అందించి వారికి ఆర్థికంగా మరింతగా అభివృది చెందెల కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో సీసీ దత్తత్రి సి ఏ సాయినాథ్ మహిళా సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు.

# పాముకాటుతో చిన్నారి మృతి



**లక్షెట్టిపేట, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
పాము కాటుకు గురై చిన్నారి మృతిచెందిన ఘటన మండలంలోని వెంకట్రావుపేటలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వెంకట్రావుపేటకు చెందిన వందన సుధాకర్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. తండ్రి సుధాకర్ హెూటల్లో పని చేస్తుండగా, తల్లి వందన కూలీ పని చేస్తోంది. వీరి చిన్నకుమార్తె ఉదయశ్రీ(4) శనివారం సాయంత్రం ఇంటి సమీపంలో ఆడుకుం టుండగా ఆమె కాలిపై పాము కాటేసింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

# నేడు ఆదివాసీ ప్రధాన్ సమాజ్ అత్యవసర సమావేశం

**ఇంద్రవెల్లి, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
ఆదివాసీ ప్రధాన్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన్ జాతి అత్యవసర సమావేశాన్ని ఆదివారం ఇంద్రవెల్లి కాగ్నే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసినట్లు ప్రధాన్ సమాజ్ పెద్దలు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రధాన్ గూడలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ అత్యవసర సమావేశాన్ని విజయవంతం చేసేందుకు ప్రధానకుల పెద్దలు, తరలిరావాలని కోరారు.

## తాటి చెట్టు పైనుంచి

# పడి గీత కార్మికుడి మృతి



**వేమనపల్లి, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
వేమనపల్లి మండలం దస్నాపూర్‌లో శుక్రవారం తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి తాళ్ళపల్లి రాకేష్ (27) అనే గీత కార్మికుడు మృతి చెందాడు. స్థాని కులు తెలిపి న వివరాల ప్రకారం తాళ్ళపల్లి రా కేష్ రోజూలాగే శుక్రవారం సాయంత్రం కల్లు గీసేం దుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమా దవ శాత్తు తాటి చె ట్టు పైనుండి కింద పడ్డాడు. దీంతో ఆయ నకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబసభ్యులు చికి త్స నిమి త్తం చెన్నూర్ ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు.

**రూ. 10లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలి..**
తాటి చెట్టు పైనుండి కిందపడి మృతి చెం దిన రాళ్లపల్లి రాకేష్ కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని మోకు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి భూ సారపు మొండిగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సా యంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డు తూ వేమనపల్లి మండలం దస్నాపూర్ గ్రామానికి చెం దిన తాళ్లపల్లి రాకేష్ గౌడ్ (25) గీతా వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కడానికి వెళ్లి చెట్టు పైనుండి కిందపడి చనిపోవడం చాలా బాధాకరమన్నారు.

# దుబాయిలో యాకర్‌పల్లి వాసి మృతి

**సారంగాపూర్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లిన యాకర్‌పల్లి వాసి మృతిచెందాడు. మండలంలోని యాకర్‌పల్లి గ్రామానికి చెందిన నిర్మల రాజు (41) రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయిలోని జెబాలీ ఏరి యాలో గల వేడా మ్స కంపెనీలో కూలీ పని చేసేందుకు వెళ్లాడు. గతనెల క్రితం అనారోగ్యానికి గురి కాగా తోటి మిత్రులు ఆసు పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స పొందుతూ ఈనెల 7న మృతి చెందాడు. మృతుడికి భార్య రుక్మవ్వ, కుమా రుడు అఖిల్(16), కుమార్తె శృతి(9)లు ఉన్నారు. ప్రభు త్వం ఆయన మృతదేహాన్ని త్వరగా రప్పించేలా ఏర్పాట్లు చేయాలని కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

# విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి

**దండేపల్లి, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ముత్యంపేటకు చెందిన వృద్ధురాలు ముత్తె రాజవ్వ (70) శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఎస్సై తహసీనొద్దీన్ కథ నం ప్రకారం.. రాజ వ్వ ఇంటి వెనకాల గల పెరటిలో కూరగాయల తోట లోకి కోతులు రావడంతో వాటిని కొట్టేందు కు వెళ్లింది. ఇంట్లోకి తిరిగి వచ్చేక్రమంలో ఇంటి ముందు ఉన్న కూ లర్ వైరు తెగిపడి ఉంది. గమనించకుండా వస్తుండగా వైరు ఆమె కాలికి తగిలింది. వైర్కు విద్యుత్ సరఫరా అయి షాక్తో కిందపడిపోయింది. గమనించిన భర్త రా యలింగయ్య, చుట్టుపక్కల వారిని పిలిచి కరెంట్ ఆఫ్ చేసి చూసేసరికి చనిపోయింది. భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# అఘోరీ నా మొగుడు

■ అఘోరీని పెళ్లాడిన వర్షిణి ■ ఒకసారి కాదు రెండు సార్లు ■ తమను ఎవరూ వీడదీయలేరని సవాల్
■ ఫ్యామిలీని వదిలేసి మళ్లీ అఘోరీ చెంతకు ■ నాకు సంసారం వద్దు.. ■ అఘోరీనే కావాలని పట్టు
■ అఘోరీది మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లి గ్రామం



**బెల్లంపల్లి, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**
అఘోరీ శ్రీవర్షిణీ ఎపిసోడ్ మరింత హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటి వరకు ఓ రేంజ్‌లో నడిచిన వీరి కథ.. ఇప్పుడు మరో మలుపు తిరిగింది. వీరిద్దరూ నాలుగు నెలల ప్రేమ బంధానికి గుర్తుగా పెళ్లి చేసుకున్నారు. అయితే అది ఒకసారి కాకపోవడం గమనార్హం. వేరు వేరు ప్రాంతాల్లో రెండు సార్లు పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. మొదటి సారి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో పెళ్లి చేసుకోగా… ఆ తర్వాత కుటుంబ సభ్యుల మధ్య వర్షిణీని అఘోరీ బంగారు చైన్ వేసి పెళ్లాడింది. ఈ వి షయాలన్నీ స్వయంగా వర్షిణీనే బయట పెట్టింది. అంతేకాకుండా ఇటీవలే గుజరాత్ నుం చి వచ్చి ఫ్యామిలీ దగ్గర ఉన్న వర్షిణి.. ఇప్పుడు మళ్లీ అఘోరీ చెంతకు చేరుకుంది. తమను ఎవరూ విడదీ యలేరని అంటోంది. తమ ప్రేమకు గుర్తుగా పెళ్లి కూడా చేసుకున్నామని చెబుతోంది. అఘోరీలో జెన్యూనిటీని చూసి ఇష్టపడ్డానని అంటోంది. అఘోరీతో సెలిలిక్స్ను తాను కోరు కోలేదని.. సెలిలిక్స్ కోరికలు తనకు లేవని తెలిపింది. ఇం దులో భాగంగానే ఆర్జీవీ ఛానెల్తో ఇచ్చిన లైవ్ ఇంటర్వ్యూలో అఘోరీపై ప్రేమను కురిపించింది. అఘోరీ అంటే తనకు ఎంత ఇష్టం..? ఎందుకు ఇష్టమో తెలిపింది. అఘోరీ కోసం ఏకంగా ప్రభాస్, పవన్ కళ్యాణ్ పాటలను డెడికేట్ చేసింది. అఘోరీ వర్షిణీ ఇద్దరూ కారులో ఉండి లైవ్ ఇచ్చారు. అందులో అఘోరీ కోసం వర్షిణీ కొన్ని పాటలు పాడింది. పవన్ కళ్యాణ్ 'అత్తారింటికి దారేది' మూవీలోని వీడు ఆర డుగుల బుల్లెట్టు అంటూ ఓ సాంగ్ పాడింది. ఆ తర్వాత.. ప్రభాస్ 'వర్షం' మూవీలోని మెల్లగా కరగనీ రెండు మనసుల దూరం అంటూ ఓ సాంగ్ పాడింది. ప్రస్తుతం అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

**మనసులు కలిశాయ్.. జెండర్ ఏంటి పని..?**
మా ఇద్దరి మనస్సులు కలిసాయని.. ఒకరినొ కరం అర్థం చేసుకున్నాకే ఇష్టపడ్డామని వర్షిణి చెప్పుకొచ్చింది. అలా ఇష్టపడిన తర్వాత పెళ్లి చేసు కున్నామని తెలిపింది. ఇప్పుడు కేవలం కలిసి ఉండాలనుకుంటున్నామని చెప్పుకొ చ్చింది. ఇక పిల్లల విషయానికొస్తే.. ఏదో ఒక ఆశ్రమంలో ఉన్న పిల్లల్ని దత్తతగా తీసుకుని పెంచుకుంటామని తెలిపింది. అలా చేస్తే వారికి కూడా ఒక మంచి జీవితాన్ని ఇచ్చినవా ళ్లం అవుతామని పేర్కొంది. తమకు శారీరక సంబంధం అవసరం లేదని.. తాము ఎప్పుడూ కలిసి హ్యాపీగా జీవించాలని కోరుకుంటున్నా మని తెలిపింది. అఘోరీలో తనకు నచ్చిన ఒకే ఒక్క మంచి క్వాలిటీ కూడా వివరిం చింది. అఘోరీ తనతో జెన్యూన్ ఉందని.. అందువ ల్లనే తనను ఇష్టపడ్డానని.. అఘోరీ అమ్మాయా? అబ్బాయా? లేక ట్రాన్స్ జెండరా? అనేది నాకు అవసరం లేదని చెప్పు కొచ్చింది. ఇదిలా ఉండగా అఘోరి స్వగ్రామం మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుశ్నపల్లి గ్రామంప్రస్తుతం ఆమె వ్యాఖ్యలతో నెటిజన్లు బిత్తరిపోతున్నారు.







# ఎన్టీఆర్‌కు రుణపడి ఉంటా

హృతిక్ రోషన్, ఎన్టీఆర్ లక పాత్రల్లో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకుడు. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ నిర్మిస్తోంది. కియారా అడ్వాణీ కథానాయిక. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఈ సందర్భంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న హృతిక్ రోషన్ 'వార్ 2'తో పాటు ఎన్టీఆర్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు."వార్ 2' చాలా సులభంగా అయిపోయింది. షూటింగ్‌కు సంబంధించి ప్రతి షెడ్యూల్ ఎంతో పర్‌ఫెక్ట్‌గా ప్లాన్ చేశారు. నిర్మాత ఆదిత్య చోప్రా, దర్శకుడు అయాన్ ముఖర్జీ వల్లే ఇలా సాధ్యమైంది. అయాన్ మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తాడు. జూనియర్ ఎన్టీఆర్‌తో పనిచేయడం వల్ల ఎన్నో ఆసక్తికర విషయాలు తెలుసుకున్నా. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటా. 'వార్ 1'తో పోలిస్తే, రెండో భాగం భారీగా ఉంటుంది. నా సినిమా గురించి నేనే ఇలా గొప్పలు చెప్పకోవడం సరికాదేమో. ఈ మూవీ చేసినందుకు చాలా గర్వంగా ఉంది'' అని అన్నారు.ఆగస్టు 14న 'వార్2'ను విడుదల చేయనున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం ప్రకటించింది. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన చిత్రం 'వార్'. ఈ స్పై థ్రిల్లర్ సూపర్ సక్సెస్ సాధించి బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. దీనికి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న చిత్రమే 'వార్ 2' (War 2). ఈ సినిమాలో ఎన్టీఆర్ రా ఏజెంట్‌గా నటించనున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. గతంలో సల్మాన్‌ఖాన్, హృతిక్ రోషన్, షారుక్‌ఖాన్‌లు ఏజెంట్ పాత్రలో నటించి మంచి విజయాన్ని అందుకున్నారు. వీటన్నింటికంటే భిన్నంగా ఎన్టీఆర్ పాత్ర ఉండనుంది. అలాగే, హృతిక్ - ఎన్టీఆర్‌లపై ఓ ప్రత్యేక గీతాన్ని కూడా రూపొందించారు. ఈ పాటలో ఇద్దరు హీరోలతో పాటు దాదాపు 500మంది డ్యాన్సర్లు పాల్గొన్నారట. బాస్కో మార్టిస్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరించినట్లు సమాచారం. సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ప్రీతమ్ ఈ పాటను చాలా గొప్పగా స్వరపరిచారని.. దాదాపు ఆరు రోజుల పాటు దీని చిత్రీకరణ జరిగిందట.

# అనుకున్న సమయానికే 'వీరమల్లు'



పవన్‌కల్యాణ్ (Pawan Kalyan) కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్, బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషించారు. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకులు. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఎ.ఎం.రత్నం సమర్పకులు. ఈ చిత్రం మే 9న రానుంది. రీరికార్డింగ్, డబ్బింగ్, విజువల్ ఎఫెక్ట్స్ కి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. "మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే విప్లవం లాంటి కథ ఇది. చారిత్రక యోధుడు వీరమల్లుగా పవన్‌కల్యాణ్ నటిస్తున్నారు. కరోనాతోపాటు, పవన్‌కల్యాణ్ రాజకీయ ప్రయాణం కారణంగా చిత్రీకరణ ఆలస్యమైనప్పటికీ ఎ.ఎం.జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతల్ని చేపట్టి రాజీపడకుండా చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. అనుకున్న సమయానికే ఈ సినిమాని తెలుగుతోపాటు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామ"ని సినీ వర్గాలు స్పష్టం చేశాయి




# జపాన్ లో జక్కన్న హడావుడి..

ఇండియన్ సినిమా ప్రస్థానాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన దర్శకధీరుడు రాజమౌళి ఇప్పుడు మరోసారి జపాన్ ప్రేక్షకుల మనసులు గెలవడానికి రెడీ అయ్యారు. 'RRR: బిహైండ్ అండ్ బియాండ్' పేరుతో విడుదలైన డాక్యుమెంటరీ మూవీ ప్రమోషన్ కోసం రాజమౌళి, ఆయన కుమారుడు కార్తికేయతో కలిసి జపాన్‌కి వెళ్లిన విషయం తెలిసిందే. జపాన్‌లో ఇప్పటికే RRR సినిమాకు బలమైన ఫ్యాన్ బేస్ ఉంది.

ఇప్పుడు ఈ డాక్యుమెంటరీను అక్కడి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంతో ఆయనకు మరింత క్రేజ్ ను తీసుకురానుంది. ఈ డాక్యుమెంటరీలో RRR సినిమా మేకింగ్ సమయంలో పడ్డ కష్టాలు, సాంకేతిక అద్భుతాలు, నటీనటుల పనితనం, దానికి వెనుక ఉన్న విజన్ ఇలా అనేక విషయాలను చూపించనున్నారు. రాజమౌళి దర్శకత్వ ప్రతిభ ఏ స్థాయిలో ఉందో ఈ ప్రాజెక్ట్ ద్వారా మరోసారి రుజువవుతోంది.

ఇప్పటికే ప్రీమియర్ షోలు జపాన్‌లో ప్రారంభమయ్యాయి. ప్రేక్షకుల నుంచి పెద్దసంఖ్యలో స్పందన వస్తోంది. జపాన్‌లో RRR సాధించిన పాపులారిటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ పాత్రలు, స్టోరీటెల్లింగ్ స్టైల్, ఎమోషనల్ హైప్స్ అన్నీ జపాన్ ఆడియన్స్‌ను ఆకట్టుకున్నాయి. రాజమౌళి బ్రాండ్ ఇమేజ్ అక్కడ మరింత పెరిగింది. ఇప్పుడు ఆ ఫాలోప్‌గా 'బిహైండ్ అండ్ బియాండ్' ప్రాజెక్ట్ తీసుకురావడం భారీ స్ట్రాటజీగా చెప్పవచ్చు.కార్తికేయ రాజమౌళి ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన పూర్తి నిర్వహణ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన గతంలో కూడా నిర్మాతగా పనిచేసిన అనుభవం ఉంది. తండ్రి పనితీరును దగ్గరగా చూసిన కార్తికేయ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో సినిమా ప్రమోషన్లో దూసుకెళ్తున్నారు. ట్విట్టర్ వేదికగా వచ్చిన వీడియోల్లో జపాన్ ప్రేక్షకులు థియేటర్లలో రాజమౌళిని స్వాగతించడం చూస్తే అది అక్కడ RRR క్రేజ్ ఇంకా తగ్గలేదని స్పష్టమవుతుంది.ఈ ప్రాజెక్టకి సంబంధించిన ప్రధాన పోస్టర్‌ను కూడా రాజమౌళి, కార్తికేయ కలిసి జపాన్ మీడియా ముందుగా ఆవిష్కరించారు. సోషల్ మీడియాలో ఇది వైరల్‌గా మారింది. ఇక రాజమౌళి హడావుడి చూస్తుంటే అతని తదుపరి సినిమా SSMB29కి కూడా అక్కడ ముందుగానే అంచనాలు క్రియేట్ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ సినిమా 1000 కోట్ల బడ్జెట్ తో పాన్ వరల్డ్ రేంజ్ లో రెడీ అవుతోంది.

# నా జర్నీలో ఇదే ప్రౌడ్ మూమెంట్

సినీ ఇండస్ట్రీలో ఎవరికెప్పుడు ఫేమ్ వచ్చి లైమ్ లైట్ లోకి వస్తారో తెలియదు. హీరోయిన్ల విషయంలో అయితే ఇదీ మరీ ఎక్కువ. ఎప్పుడు ఎలా ఫేమ్ లోకి వచ్చి వార్తల్లో నిలుస్తారో ఎవరూ ఊహించలేరు. కొంతమందికి రెడ్ కార్పెట్ ల ద్వారా ఫేమ్ వస్తే, మరికొందరికి మరోలా వస్తుంది. అయితే ఇప్పుడు బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ ఎప్పటికంటే ఎక్కువగా ఫేమస్ అవుతోంది.బాలీవుడ్లో వరుస ఫ్లాపుల తర్వాత ఇప్పుడు సడెన్ గా జాన్వీ పేరు ప్రపంచ వేదికపై వినిపిస్తోంది. ఆ వేదిక మరేదో కాదు. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్. ఇషాన్ ఖట్టర్ తో కలిసి జాన్వీ కపూర్ నటించిన హోమ్ బౌండ్ అనే సినిమా 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ లో అన్ సెర్టైన్ రిగార్డ్ విభాగంలో ప్రదర్శనకు సెలెక్ట్ అయింది. ఈ సినిమాకు హైదరాబాద్ కు చెందిన నీరజ్ గైవాన్ దర్శకత్వం వహించారు.ప్రపంచవ్యాప్తంగా అందరూ ఎంతో ఇష్టపడే ప్రతిష్టాత్మక కళాత్మక చిత్రాల లీగ్ లో హోమ్ బౌండ్ చేరింది. నీరజ్ తీసిన మొదటి సినిమా మసాన్ కూడా ఇదే బాటలో నిలవగా, ఇప్పుడు హౌమ్ బౌండ్ కూడా అదే బాటలో వెళ్తూ ఆ లెగసీని కంటిన్యూ చేస్తోంది. మే 13 నుంచి మే 24 మధ్య హోమ్ బౌండ్ సినిమా ప్రపంచంలోని బెస్ట్ సినిమాలతో పాటూ కేన్స్ లో ప్రదర్శించబడనుంది.ఈ సందర్భంగా జాన్వీ తన ఇన్‌స్టాలో మాట్లాడుతూ తన మొత్తం జర్నీలో ఇది ప్రౌడ్ మూమెంట్ అని, నటిగా మాత్రమే కాకుండా, ఇంటర్నేషనల్ ప్లాట్‌ఫామ్ పై ఇండియన్ సినిమాకు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తిగా తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపింది. ఇండియాలో పాతుకుపోయిన కథలు, వాటి భావోద్వేగాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని నిర్మాత కరణ్ జోహార్ ఈ సందర్భంగా అన్నారు.ఇవాళ కేన్స్ తో వార్తల్లో నిలిచిన జాన్వీ కపూర్, రేపు మరో కొత్త అంశంలో వార్తల్లోకెక్కొచ్చు. హోమ్ బౌడ్ సినిమాతో ప్రపంచ దృష్టిని ఎట్రాక్ట్ చేసిన జాన్వీ ప్రస్తుతం రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్నపెద్ది సినిమాలో నటిస్తోన్నసంగతి తెలిసిందే.

# ఆదివాసీల హక్కులు పరిరక్షించాలి



■ జోడేఘాట్‌లో ప్రారంభమైన తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలు ■ హాజరైన ప్రొఫెసర్ కోదండరాం

**కెరమెరి, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

పాలకులు చట్టాలను మార్చడంతోనే ఆదివాసీల అణిచివేత ప్రారంభమైందని, ఆదివాసీల హక్కులను పరిరక్షించాలని ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. శనివారం మండలంలోని జోడేఘాట్‌లో ప్రారంభమైన తుడుం దెబ్బ రాష్ట్ర మహాసభకు హాజరయ్యారు. అంతకుముందుకు మురంభీం విగ్రహానికి, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహాసభలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్న క్రమంలో 73, 74వ రాజ్యాంగ సవరణతో ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు కల్పించిన హక్కులు, చట్టాలు ఖూనీ అవుతున్నాయని పేర్కొన్నారు. అ మరుల ఆశయాలు కొనసాగించినప్పుడు, కుల, రాజకీయాలకు అతీతంగా పోరాడినప్పుడు హక్కులు, చట్టాలు అమలుకు నోచుకుంటాయని చెప్పారు. హక్కుల సాధనకు ఐక్యపోరాటాలే శరణ్యమన్నారు. మహాసభలో రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు బుర్స పోచయ్య, కోకన్వీనర్ కోట్నాక విజయ్, నాయకులు విజయ్, నగేశ్, లక్ష్మీ నారాయణ, నరసింహారావు, రఘుపతిరావు, నారాయణ, బాపు, రవి, రాజేందర్ తదితరులతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. నేడు రేపుకూడా మహాసభలు జరగనున్నాయి.

# రైల్వే స్టేషన్ పెండింగ్ పనులు పూర్తి చేయండి

### డీఆర్‌ఎం ప్రదీప్ కాంబ్లేకు ఎంపీ, ఎమ్మెల్యే వినతి



**ఆదిలాబాద్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

మహారాష్ట్ర ప్రాంతానికి అతి సమీపంలో ఉన్న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ పరిధిలో పెండింగ్ పనులను పూర్తిచేయాలని ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ లు రైల్వే డీఆర్‌ఎంను రైల్వే డీఆర్‌ఎంను కలిసి విన్నవించారు. దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం ప్రదీప్ కామ్రే శనివారం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌ను సందర్శించి పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, తదితర వాటిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముందుగా రైల్వే డిఆర్‌ఎం ఆయనను శాలువతో సత్కరించారు. అనంతరం ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో పెండింగ్ ప్రాజెక్టులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఎం మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యేలతో స్థానిక రైల్వే సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. అదనపు రైళ్లు పొడిగించడం, పెండింగ్ లో ఉన్న పిట్ లైన్, రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వేగవంతంగా పూర్తి అయ్యేందుకు తనవంతు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే కృషితో రైల్వే శాఖ తరపున అవసర మైన అన్ని చర్యలు చేపట్టి, జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా రైల్వే పిట్ లైన్ పనులు కొనసాగుతున్నాయని, రెండు మూడు నెలల్లో పూర్తి అవుతాయని ఎంపీ నగేష్ తెలిపారు. రైల్వే డబల్ లైన్ సర్వే కోసం రైల్వే బోర్డు ఆర్డర్ ఇచ్చిందన్నారు. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిఆర్‌ఎమ్ కోరినట్లు ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. జిల్లా నుండి కొత్త రైల్లను ప్రారంభించాలని కోరారు.

విలేకరులు
కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# అనాథ యువతి పెళ్లికి వెడ్మ ఫౌండేషన్ చేయూత

**ఉట్నూర్, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

మండలంలోని లక్షిటీపేట గ్రామానికి చెందిన మెస్రం అనిత తల్లి తండ్రులు కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందారు. దీంతో ఆ యువతి అనాథగా మారింది.గ్రామ పెద్దలు ఈనెల 14న మెస్రం అనిత పెళ్లి ఆర్క మహేష్‌తో నిశ్చయించారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆ యువతి వివాహానికి 15వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి, మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు కుటుంబాలకు వెడ్మ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ప్రజా సేవకే వెడ్మ ఫౌండేషన్ నిర్మాణం అయిందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో లక్షెట్టిపేట గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# 14న మంచిర్యాలకు డిప్యూటీ సీఎం భట్టి రాక

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- భట్టితో పాటు ఆరుగురు మంత్రులు కూడా..
- అంబేద్కర్ విగ్రహ ఏర్పాట్లు పూర్తి చేయాలి..
- పనులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు



**మంచిర్యాల, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

అంబేద్కర్ జయంతి రోజునే మంచిర్యాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు తెలిపారు. 14న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పౌరసరఫరాల, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కానున్నారు. ఈ క్రమంలో పలు శాఖలకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు చేస్తారు. జిల్లా కేంద్రంలో బైపాస్ అమరవీరుల స్తూపం మీదుగా రంగంపేట వైపు పాత మంచిర్యాల వరకు ఆరు వరుసల రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. గోదావరి వరదలతో ముంపు రాకుండా రాళ్లవాగుపై నిర్మించనున్న రక్షణ గోడ పనులు ప్రారంభిస్తారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరిస్తారు. తర్వాత జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పరిశీలిస్తారు. స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. అంబేద్కర్ జయంతి వేడుకలతోపాటు ఇతర అభివృద్ధి పనులకు మోక్షం కలుగనుంది. జెడ్పీ హైస్కూల్ వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే అధికార యంత్రాంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



### ఆలయాల అభివృద్ధికి

# ప్రభుత్వం కృషి చేస్తోంది

### ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

**కడెం, ఏప్రిల్ 12 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలోని ఆలయాలను సుందరంగా తీర్చి దిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో హనుమాన్ ఆలయం చుట్టూ ఆరు లక్షల పైచిలుకు నిధులతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల అభ్యున్న తికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని అల యాలను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం పాటు పడు తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూషణ్, మాజీ ఎంపీపీ అలెగ్జాండర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్, మండల యూత్ అధ్యక్షుడు రెంకల శ్రీనివాస్, నాయకులు కోల శీను, ఆకుల లచ్చన్న, ఆరిఫ్, రాజేశ్వర్, సుధాకర్, గోస్కుల మల్లేష్, దినకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

